సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 2 । అక్టోబర్ । 2024



రూ.1,01,000 విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయం వద్ద నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి పేరిచర్ల సూర్యనారాయణరాజు (రాజమహేంద్రవరం) రూ.1,01,000 విరాళం అందజేశారు.



దోపిడీ దొంగల ముఠా అరెస్టు

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా అమలాపురం రూరల్ పోలీసులకు పట్టుబడింది. నాలుగేళ్ల నుంచి పలు రాష్ట్రాల్లో 42 చోరీలు చేసిన ఈ ముఠాను పోలీసులు అరెస్టు చేసి బంగారు, వెండి వస్తువులను రికవరీ చేశారు. 10లో..

2.92 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 2,92,172 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 11,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా 'వైట్ల'



వైట్ల కనక దుర్గారావు

ఆలమూరు: రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సంయుక్త కార్యదర్శిగా ఆలమూరుకు చెందిన పారిశ్రామికవేత్త, కృష్ణ ప్రభాస్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ వైట్ల కనక దుర్గారావు నియమితులయ్యారు. రాష్ట్ర శాఖ ఈమేరకు మంగళవారం ఉత్తర్వులను వెలువరించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో ఇప్పటి వరకూ కోశాధికారిగా ఆయన పనిచేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పదవి కోసం అనేక మంది వ్యాపారవేత్తలు పోటీపడినా అసోసియేషన్ సభ్యులంతా దుర్గారావు వైపే మొగ్గు చూపడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీలో 35 ఏళ్ల అపార అనుభవం కలిగిన దుర్గారావు ఈ పదవికి ఎంపిక కావడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

జాబ్‌మేళాలో 36 మందికి ఉద్యోగాలు



ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను అందజేస్తున్న జేసీ నిశాంతి

అమలాపురం రూరల్: వికాస అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల కల్పన విభాగం అధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో రెండు ప్రముఖ సంస్థలు పాల్గొని 36 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాయని జేసీ నిశాంతి తెలిపారు. నిరుద్యోగ యువత అర్హత ధ్రువ పత్రాలు పరిశీలించి ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఏంపిక చేసినట్లు తెలిపారు. 93 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా ఇండో ఎంఐఎం సంస్థ 14 మందిని, గూగుల్ పే సంస్థ 22 మందిని ఎంపిక చేసుకున్నాయన్నారు. అభ్యర్థులకు జేసీ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందజేసినట్టు వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ తెలిపారు.

ఉపాధి కల్పించండి



మూతపడిన ప్రభుత్వ మద్యం దుకాణం

అమలాపురం టౌన్: తమ ఉద్యోగాలను నిలబెట్టి ఉపాధి కల్పించండి అనే డిమాండ్ చేస్తూ జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో (అవుట్ లెట్స్) పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్లు తమ తమ ప్రాంతాల్లోని మంగళవారం దుకాణాలు మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని అమలు చేస్తూ ప్రైవేటుపరం చేయడంతో టెండర్లు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న సమయంలో వారు ఈ విధంగా నిరసన తెలిపారు. దుకాణాల తాళాలు ప్రస్తుతం సూపర్ వైజర్లు, సేల్స్‌మన్లు వద్దే ఉండడంతో వారు మంగళవారం దుకాణాలు మూసివేసి నిరసనకు దిగారు. దీంతో అమలాపురంలోని ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ పరిధిలో జిల్లాలో ఉన్న దాదాపు 100 మద్యం దుకాణాలు మూతపడ్డాయి. జిల్లా ప్రభుత్వ మద్యం దుకాణాల సేల్స్ మెన్లు, సూపర్ వైజర్లు ఎన్‌వీ రమణ, జి.దుర్గాప్రసాద్, పి.సుభాష్, గొల్లపల్లి చంటి, సీహెచ్ లక్ష్మీనారాయణ, బందారు రవికుమార్ తదితరులు దుకాణాల బంద్‌కు, నిరసనకు నాయకత్వం వహించారు.

రత్నగిరిపై రేపటి నుంచి దసరా వేడుకలు



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి ఆలయం

అన్నవరం : రత్నగిరి శ్రీసత్యదేవుని సన్నిధిన శరన్నవరాత్ర వేడుకలు (దసరా ఉత్సవాలు) ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి, అక్టోబర్ మూడో తేదీ గురువారం నుంచి అక్టోబర్ 12వ తేదీ, శనివారం, విజయదశమి పర్వదినం వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ మంగళవారం తెలిపారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుని ఆలయంలో పండితులు కలశ స్థాపన చేసి దసరా వేడుకలకు అంకురార్పణ చేస్తారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కుంకుమ పూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించే 44 మంది రుత్విక్కులు 16 మంది అర్చక స్వాములకు అధికారులు దీక్షా వస్త్రాలు అందజేస్తారని అధికారులు తెలిపారు.

రాదారికో రగడ



శివకోడు రహదారి

- జాతీయ రహదారి పనులకు అడుగడుగునా అవాంతరాలు
- కోనసీమ జిల్లాలో నిలిచిన పనులు
- నత్తను తలపిస్తున్న జొన్నాడ ఫ్లై ఓవర్
- ఎన్‌హెచ్-216 విస్తరణకు భూ వివాదాలు
- కోర్టును ఆశ్రయించిన బాధితులు
- మామిడికుదురులో నిలిచిన బైపాస్ పనులు
- ముందడుగు పడని సఖినేటిపల్లి-నర్సాపురం బైపాస్

సాక్షి, అమలాపురం: జాతీయ రహదారుల నిర్మాణ పనులు జిల్లాలో నత్తను తలపిస్తున్నాయి. రోడ్ల విస్తరణ పనులకు భూసేకరణ.. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు మందకొడిగా సాగడం.. కారణాలు ఏమైనా జాతీయ ఉపరితల రవాణా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు ముందుకు సాగడం లేదు. కత్తిపూడి-ఒంగోలు విస్తరణ పనులు.. 216లో పేరూరు నుంచి 216 ఏ రావులపాలెం మార్కెట్ యార్డు వరకు రహదారి విస్తరణ.. శివకోడు నుంచి సఖినేటిపల్లి మీదుగా నర్సాపురం వరకు జాతీయ రహదారి నిర్మాణం.. జొన్నాడ వద్ద ఫ్లై ఓవర్ పనులు నిర్ణీత షెడ్యూలు కన్నా ఆలస్యమవుతున్నాయి.

వంతెనకు సైతం భూసేకరణ అడ్డంకి

దశాబ్దాల కాలంగా రాజోలు దీవి వాసులు కోరుకుంటున్న సఖినేటిపల్లి-నర్సాపురం వంతెన నిర్మాణంతో పాటు శివకోడు నుంచి నర్సాపురం వరకు నిర్మించ తలపెట్టిన జాతీయ రహదారి పనులకు సైతం భూసేకరణ అడ్డంకిగా మారింది. జాతీయ రహదారి 216 బైపాస్ రోడ్డులో వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ఎన్‌హెచ్ ఉత్తర్వులు జారీ చేసి ఏడాది కావస్తోంది. సఖినేటిపల్లి రేవు వద్ద వంతెన నిర్మాణానికి పలుసార్లు శంకుస్థాపన జరిగింది కాని వివిధ కారణాలతో పనులు మొదలు కాలేదు. దీనిని గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన కృషి ఫలితంగా ఈ పనులు చేసేందుకు ఎన్‌హెచ్ ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా ఆర్‌అండ్‌బీ పరిధిలోని వంతెన నిర్మాణాన్ని జాతీయ రహదారి పరిధిలోకి తీసుకువచ్చారు. శివకోడు నుంచి సఖినేటిపల్లి మీదుగా నర్సాపురం మండలం రామరాజులంక వరకు వరకు బైపాస్ నిర్మించాల్సి ఉంది. సుమారు 22.17 కిలోమీటర్లు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును హైవేగా గుర్తించారు. వశిష్ఠపై రామరాజులంక వద్ద వశిష్ఠపై 380 మీటర్ల మేర వంతెన నిర్మించనున్నారు. వంతెన, రహదారి నిర్మాణాల కు రూ.658.12 కోట్లకు ప్రతిపాదనలు పంపగా, రూ.580.42 కోట్లకు అనుమతి మంజూరు చేశారు. వంతెన, రోడ్ల నిర్మాణాల పనులను 2025-26 పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాని ఈ పనులకు సైతం భూసేకరణకు అవాంతరాలు ఏర్పడ్డాయి. కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీనితో పనులు ముందుకు సాగడం లేదు.

ప్రమాదాల నిలయంగా జొన్నాడ సెంటర్



ఫ్లైఓవర్ పనుల్లో జాప్యం వల్ల జొన్నాడ సెంటర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. రోజుల తరబడి పిల్లర్ల పనులు చేపట్టడంతో జాతీయ రహదారికి ఇరువైపులా చిత్తడిగా మారి వాహనచోదకులు జారి పడిపోతున్నారు. కొద్దిపాటి వర్షానికే పలు ప్రాంతాల్లో చిత్తడిగా మారుతోంది. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు రావడం వల్ల ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసి ఫ్లైఓవర్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి.

– కట్టా శ్రీనివాసు, జొన్నాడ, ఆలమూరు మండలం

నిలిచిపోయిన జొన్నాడ ఫ్లై ఓవర్ అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు



ఫ్లై ఓవర్ నిర్మాణం ఎప్పుడో?

216 ఏ జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణ.. ట్రాఫిక్ నియంత్రణకు ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వరకూ రూ.300 కోట్ల వ్యయంతో ఐదు ఫ్లై ఓవర్లను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. నాలుగేళ్ల వ్యవధిలో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని నిర్దేశించారు. రాజమహేంద్రవరం (మోరంపూడి), జొన్నాడ, తణుకు, తేతలి, కైకరంలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు దశల వారీగా ప్రారంభమయ్యాయి. మోరంపూడి, జొన్నాడ ఫ్లై ఓవర్ పనులు 2022 సెప్టెంబర్ 22న ఒకేసారి ప్రారంభమయ్యాయి. మోరంపూడి ఫ్లై ఓవర్ ఈ నెల ఎనిమిదిన ప్రారంభోత్సవం చేసుకుని వాహనాల రాకపోకలు సాగిస్తోంది. జొన్నాడ ఫ్లైఓవర్ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఇంకా అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. పిల్లర్ల నిర్మాణ పనులు నెమ్మదించాయి. ఏడాది కాలంగా కేవలం పిల్లర్ల పనులు జరుగుతూనే ఉన్నాయంటే పనులు ఎంత వేగంగా సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. నిర్మాణ పనుల వల్ల జొన్నాడ సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ నిలిచి ఇటు రాజమహేంద్రవరం, రావులపాలెం, కాకినాడ వెళ్లే ప్రయాణికులు నరకం చూస్తున్నారు.

అనుసంధానం జరిగేనా?

జాతీయ రహదారి 216, జాతీయ రహదారి 216 ఏ మధ్య అనుసంధానం చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో ఎన్‌హెచ్ ముందుకు వచ్చింది. దీనికి రూ.450 కోట్లు కేటాయించేందుకు సిద్ధమైంది. ఎన్‌హెచ్ 216 పేరూరు వై.జంక్షన్ వద్ద నుంచి ఇందుపల్లి, ఈదరపల్లి, ముక్కామల, కొత్తపేట పలివెల వంతెన వద్ద నుంచి రావులపాలెం మార్కెట్ యార్డు వద్ద 216 ఏలో రహదారి కలవాల్సి ఉంది. ఇప్పటి వరకు ఈదరపల్లి నుంచి కొత్తపేట వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి మరింత వెడల్పు కానుంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రెండు జాతీయ రహదారుల మధ్య మరో ఎన్‌హెచ్ రోడ్డు వచ్చినట్టువుతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతానికి భూ సమస్యలు లేకున్నా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జాతీయ ఉపరితల రవాణా శాఖ అధికారులకు సంప్రదించేవారు లేకుండా పోయారు. దీనితో ఈ రోడ్డు ప్రశ్నార్థకంగా మారింది.



ఈదరపల్లి రహదారి

అర కిలో మీటరు మాత్రమే..

కాకినాడ జిల్లా కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు సుమారు రూ.నాలుగు వేల కోట్లతో విస్తరించ తలపెట్టిన 216 జాతీయ రహదారి నిర్మాణం దాదాపు పూర్తయింది. కాకినాడ బైపాస్ పరిధిలో రైల్వేట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మాణం ఆగింది. అలాగే రాజోలు దీవిలో పాసర్లపూడి నుంచి శివకోడు వరకు జరగాల్సిన బైపాస్ పనులలో మామిడికుదురులో అర కిలోమీటరు మేర పనులు నిలిచిపోయాయి. భూసేకరణ పరిహారం పంపిణీ విషయంలో అధికారులు కొందరికి ఒకలా మరికొందరికి మరొకలా పరిహారం ఇవ్వడాన్ని రైతులు నిరసిస్తున్నారు. కొంతమందికి గజాల రూపంలోనూ.. మరి కొంతమందికి సెంట్ల రూపంలో పరిహారం ఇచ్చారని రైతుల ఆరోపణ. ఈ కారణంగా భూసేకరణను రైతులు అడ్డుకుంటున్నారు. తాటిపాక సెంటర్ సమీపంలోని కడలి జంక్షన్ నుంచి మధ్య నుంచి శివకోడు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి. దీనిపై వాహనాల రాకపోకలు కూడా సాగుతున్నాయి. కానీ భూ సేకరణ జరగక పాసర్లపూడి నుంచి కడలి జంక్షన్ వరకు నిర్మాణ పనులు పూర్తికాలేదు. కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు రోడ్డు అందుబాటులోకి రావడంతో చాలామంది వాహనచోదకులు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నిర్మాణం కూడా పూర్తయితే వాహన ప్రయాణాలు మరింత సులువుగా సాగేందుకు వీలు చిక్కుతుంది.



మామిడికుదురులో భూసేకరణ జరగని ప్రాంతం

షెడ్యూల్ ప్రకారమే సంక్షిప్త సవరణ

ఓటర్ల జాబితాపై సిబ్బందికి జేసీ నిశాంతి ఆదేశం

అమలాపురం రూరల్: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ఇంటింటి సర్వే, క్లెయిముల పరిష్కార పురోగతి, మ్యాపుల అప్‌గ్రేడేషన్, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, 1500 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలకు అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 99.58 శాతం ఇంటింటి సర్వే పూర్తయిందని, ఫారం 6, 7, 8 క్లెయిములు 3.24 శాతం పెండింగ్ ఉన్నాయని తెలిపారు. అలాగే మ్యాపింగ్ ఐదు శాతం ఇంకా పెండింగ్ ఉన్నట్లు ఆమె స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి అంశాన్ని పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. ఓటర్ జాబితా సంక్షిప్త సవరణ ప్రకారం అన్ని ప్రక్రియలు పూర్తి చేస్తామన్నారు. ఎపిక్ కార్డులలో వ్యత్యాసాలు సరిచేస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ మురళీకృష్ణ తహసీల్దార్ జీడీ కిశోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రధాన అధికారితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నిశాంతి

నిబంధనల మేరకు అసైన్డ్ భూముల హక్కులు

20 ఏళ్లు పైబడిన అసైన్డ్ భూముల ఉచిత హక్కుల కల్పన, కుల ధ్రువీకరణ పత్రాల జారీ అంశాలలో నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని జేసీ నిశాంతి రెవెన్యూ తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్, భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి, రెవెన్యూ ఉన్నతాధికారులు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అసైన్డ్ భూములపై ఉచిత హక్కుల కల్పనకు వెరిఫికేషన్ రిజిస్ట్రేషన్ తనిఖీ, భూములకు సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ అంశాలపై జిల్లా కలెక్టర్లు, జేసీలు తదితర అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

సుస్థిర ఆర్థిక అభివృద్ధితో స్వర్ణాంధ్ర –2047

ఆర్థిక రంగం 15 శాతం వార్షిక అభివృద్ధితో ఉండేలా స్థానికంగా లభించే వరి, కొబ్బరి ఆక్వా రంగాల విలువ ఆధారిత పరిశ్రమలతో పాటుగా విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమ మౌలిక సదుపాయాలు సుస్థిర ఆర్థిక అభివృద్ధితో స్వర్ణాంధ్ర –2047 దార్శనికత పత్రం రూపకల్పనకు కృషి చేస్తున్నట్టు జేసీ నిశాంతి పేర్కొన్నారు. మంగళవారం స్వర్ణాంధ్ర-2047 దార్శనికత పత్రం రూపకల్పనపై ప్రజాభిప్రాయ సేకరణను జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, వివిధ రంగాల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్లతో పాటు కార్యాచరణ ప్రణాళికలు రానున్న ఐదేళ్లపాటు రూపొందించనున్నట్టు తెలిపారు. ప్రజలందరూ భాగస్వాములై అమూల్యమైన అభిప్రాయాలను తెలపాలని సూచించారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానికంగా మౌలిక వసతులు మెరుగుపడాలని, విద్యావ్యాప్తికి కళాశాలలు అన్ని ప్రాంతాల్లో ఉండాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం నెలకొల్పి అభివృద్ధికి పట్టం కట్టాలని సమాజానికి ఉపయోగపడే పనులు నిర్వహించాలని సూచించారు. సీపీఓ వెంకటేశ్వర్లు, జిల్లా స్థాయి అధికారులు, వివిధ రంగాల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా సరదా

రాయవరం: పాఠశాలలకు గురువారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకూ ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్‌ను అనుసరించాల్సి ఉంటుంది. అక్టోబరు 2 బుధవారం గాంధీ జయంతి సెలవు దినం కావడంతో ఈ నెల 2 నుంచే పాఠశాలలకు సెలవులు వర్తించనున్నాయి. జిల్లాలోని 2,083 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ సెలవులు వర్తిస్తాయి. ఈసారి దసరా సెలవుల్లో రెండో శనివారం, ఆదివారం కలిపి మొత్తం 11 సెలవు దినాలు వస్తున్నాయి. సెలవులు 10 రోజుల కంటే తక్కువ, 15 రోజుల కంటే ఎక్కువ వచ్చిన సందర్భాల్లో ఉపాధ్యాయులు అత్యవసర పరిస్థితుల్లో పాఠశాల మూసివేసే రోజు, లేదా పాఠశాల ప్రారంభించే రోజుల్లో ఏదో ఒక రోజు సెలవు పెట్టుకునే అవకాశం ఉంటుంది. ఈసారి ప్రకటించిన సెలవులు 12వ తేదీ రెండో శనివారం, 13వ తేదీ ఆదివారం కలిపి 11 రోజులు ఉన్నందున పాఠశాల మూసివేసే రోజు లేదా ప్రారంభం రోజున సెలవు వాడుకునే అవకాశం ఉండదు. అందువలన దసరా సెలవుల ముందు రోజు గాంధీ జయంతి కావడంతో మంగళవారం, సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమయ్యే ఈ నెల 14వ తేదీ సోమవారం ఉపాధ్యాయులు పాఠశాలలకు తప్పనిసరిగా హాజరు కావాల్సిందే. ఒకవేళ విధి లేని పరిస్థితుల్లో ఉపాధ్యాయుడు సెలవు పెడితే దసరా సెలవులు 12 రోజులు వారి వ్యక్తిగత సెలవుల కిందకు వస్తాయి. ఆ ఉపాధ్యాయుడికి ఉన్న అర్హత సెలవుల నుంచి వీటిని తగ్గించే అవకాశముంది.



సెలవుల ప్రకటనతో ఉత్సాహంగా ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

చిరుత జాడ లేదు..

- గాలింపు కొనసాగుతోంది
- అటవీ శాఖ అధికారి భరణి




రాజానగరం: గడచిన ఆరు రోజులుగా జిల్లాలో చిరుతపులి జాడ లేదని, అయినప్పటికీ దానిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతుందని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్. భరణి తెలిపారు. సెప్టెంబర్ ఆరు నుంచి ఈ చిరుతపులిని బంధించేందుకు చేపట్టిన గాలింపు చర్యల్లో భాగంగా పలుచోట్ల ట్రాప్ కెమెరాలను, ఇనుప బోనులను అమర్చామని, దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు ఏరియాలో చివరిగా గత నెల 19న ట్రాప్ కెమెరాలో దాని కదలికలు నమోదయ్యాయన్నారు. ఆ తరువాత 24న కడియం నుంచి వీరవరం వెళ్లే రోడ్డుల్లో దోశాలమ్మ ఆలయం వద్ద ఉన్న నర్సరీలో చిరుతపులి పాదముద్రలను గుర్తించామన్నారు. ఈ క్రమంలో 19 నుంచి 30 వరకు దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు ఏరియాలో దాని కదలికలు గుర్తించలేదని వివరించారు. నర్సరీల వైపు దాని పయనం సాగిందనే విషయాన్ని పాదముద్రల ద్వారా గుర్తించి, ఆ ప్రాంతంలో కూడా ట్రాప్ కెమెరాలను, సీసీ కెమెరాలను అమర్చామని, కానీ వాటిలో కూడా దాని కదలికలు నమోదు కాలేదన్నారు. అయితే 29న కోనసీమ జిల్లా రావులపాలెం గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో చిరుతను చూసినట్టుగా కొంతమంది మత్స్యకారులు ఇచ్చిన సమాచారంతో అలెర్ట్ అయి ఆరు బృందాలను ఏర్పాటుచేసి, గాలింపు ముమ్మరం చేశామని, అయినా ఆచూకీ లభించలేదన్నారు. ఈ నేపథ్యంలో పై మూడు ప్రాంతాలు (దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు, కడియపులంక, రావులపాలెం లంక ప్రాంతాలలో ప్రత్యేక బృందాలకు గాలింపును కొనసాగించదలచామని జిల్లా అటవీశాఖ అధికారి తెలిపారు. ఈ విషయమై తప్పుడు ప్రచారాలు చేయవద్దని, ఒకవేళ ఆవిధంగా ఎవరు చేసినా శిక్షార్హులేన్నారు. అలాగే ప్రజలు కూడా అసత్య ప్రచారాలను నమ్మి భయాందోళనలకు గురికావొద్దన్నారు. ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే తమకు తెలియజేసి, సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి పుష్కర వనం పునఃప్రారంభం

చిరుతపులి సంచరిస్తుందనే సమాచారంతో ముందు జాగ్రత్త చర్యగా మూసి వేసిన గోదావరి మహాపుష్కర వనాన్ని బుధవారం నుంచి పునఃప్రారంభించనున్నామని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి వెల్లడించారు. సందర్శకులు మునుపటి మాదిరిగానే పుష్కరవనానికి రావొచ్చన్నారు.

ఆకట్టుకున్న బాపూజీ బొమ్మ





రావి ఆకుపై బాపు చిత్రం (అంతరచిత్రం) సొదాగర్

రాయవరం: భారత జాతి పితగా, స్వాతంత్ర్య సాధనలో చెరగని ముద్ర వేసిన విషయం అందరికీ తెలిసిందే. అక్టోబరు 2న జాతిపిత జయంతిని ఘనంగా నిర్వహించుకునేందుకు భారతావని సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో పలువురు పలు రకాలుగా నివాళులర్పిస్తున్నారు. రాయవరం గ్రామానికి చెందిన ఇందుగమిల్లి సొదాగర్ రావి ఆకుపై మహాత్ముడి చిత్రాన్ని వాటర్ కలర్స్‌తో రూపొందించాడు. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది.


దివ్యాంగురాలి పింఛను తొలగింపు

88శాతం వైకల్యం ఉన్నా నిలిపివేత

రామచంద్రపురం: మంచమ్మీద దివ్యాంగురాలిగా పడి ఉన్నా.. ఆమె పట్ల ఈ ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయింది. ఎప్పటి నుంచో వస్తున్న పెన్షన్‌ను కుంటిసాకులతో నిలిపివేసిన ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధితురాలి భర్త రమణబాబు విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రామచంద్రపురం 23 వార్డుకు చెందిన అములోజు శ్యామల వయసు 54 ఏళ్లు. ఈమెకు పక్షవాతం వచ్చిందని, 88శాతం వికలాంగత్వం ఉందని వైద్యాధికారులు 2005లో ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. 2011 నుంచి శ్యామల దివ్యాంగుల కోటాలో పెన్షన్ తీసుకుంటున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చాక ఎటువంటి దరఖాస్తు పెట్టుకోకుండానే రెండు నెలల పాటు పెరాల్సిస్ పెన్షన్‌గా నెలకు రూ.15 వేల చొప్పున ఇచ్చారు. అయితే సెప్టెంబర్ 17వ తేదీన పెన్షన్ తీసివేస్తున్నామని, దివ్యాంగ సదరమ్ సర్టిఫికెట్‌లో అవసరమైన మేర వైకల్య శాతం లేకపోవటంతో పెన్షన్ తీసివేస్తున్నామని నోటీసు ఇచ్చారు. అయితే ఆ నోటీసును ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో దివ్యాంగురాలైన శ్యామలకు 10వ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ శాపిరెడ్డి శ్రీనివాస్ ఇచ్చారు. ఇది ఇంటి పన్ను రసీదు అని చెప్పి ఆమె వద్ద సంతకం కూడా చేయించుకున్నారు. 15 రోజుల్లో నోటీసుకు సమాధానం ఇవ్వాల్సి ఉండగా ఆ వెల్ఫేర్ సెక్రటరీ నిర్వాకంతో దివ్యాంగురాలు ఆ నోటీసును ఇంటి పన్ను రసీదుగా భావించడంతో నోటీసుకు సమాధానం ఇచ్చే అవకాశం లేకపోయింది. ఈ నెల పెన్షన్ రాకపోవడంతో వెల్ఫేర్ సెక్రటరీ ఇచ్చింది ఇంటి పన్ను రసీదు కాదు అన్న విషయం బయటపడింది. 88 శాతం వైకల్యం ఉందని సదరమ్ సర్టిఫికెట్లో ఉన్నప్పటికీ అవసరమైన మేర వైకల్య శాతం లేదని నోటీసు ఇవ్వటం దారుణమని దివ్యాంగురాలి భర్త ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా 2011 నుంచి వికలాంగ పెన్షన్ తీసుకుంటుంటే మధ్యలో కూటమి ప్రభుత్వం వచ్చాక పెరాల్సిస్ పెన్షన్‌గా అడక్కుండానే మార్చి వేసి గతంలో వచ్చిన దివ్యాంగ పెన్షన్ కూడా తీసేశారని ఆయన వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తిరిగి పాత పెన్షన్ ఇప్పించాలని ఆయన కోరారు.



పక్షవాతంతో మంచం పట్టిన శ్యామల



సచివాలయ ఉద్యోగి శ్రీనివాస్ అందించిన నోటీసు



88 శాతం వైకల్యం ఉందని వైద్యాధికారులు అందించిన సదరమ్ సర్టిఫికెట్

క్లుప్తంగా

వాహనం ఢీకొని ఇద్దరి మృతి


ప్రమాదంలో మృతి చెందిన మహేష్


మృతుడు కరీముల్లా (ఫైల్)

రంగంపేట: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందినట్టు ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలు వైఎస్సార్ కాలనీకి చెందిన పడాల మహేష్ (29), రాజమహేంద్రవరం మంగళవారపుపేటకు చెందిన సయ్యద్ కరీముల్లా (29) ఇద్దరూ కలసి పల్సర్ బైక్‌పై కాకినాడ వెళ్తున్నారు. మహేష్‌కు చెందిన లారీ కాకినాడలో ఉందని దానిని తీసుకురావడానికి వెళ్తుండగా రంగంపేట మండల పరిధిలోని కోటపాడు, రామేశంపేట గ్రామాల మధ్య ఏడీబీ రోడ్డులో గుర్తు తెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మహేష్, కరీముల్లా అక్కడికక్కడే మృతి చెందారు. కరీముల్లా తలపై నుంచి వాహనం చక్రాలు వెళ్లిపోవడంతో తల భాగం ఛిద్రమైపోయింది. మహేష్ తల వెనుక భాగంలో తీవ్ర గాయం కావడంతో సంఘటనా స్థలంలోనే వారు మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పెన్షన్ సొమ్ము కోసం వృద్ధురాలిపై దాడి

- ఇంటి దగ్గర దింపుతానని నమ్మించి బైక్‌పై నుంచి తోసేసి నగదుతో పరారు
- పట్టుకునేందుకు స్థానికుడి విఫలయత్నం
- విషయం తెలుసుకున్న కమిషనర్ సొంత సొమ్ము రూ.4 వేలు అందజేత

పిఠాపురం: పింఛన్ సొమ్ముతో వస్తున్న ఒక వృద్ధురాలిపై దాడి చేసి నగదతో ఉడాయించిన ఘటన పిఠాపురంలో మంగళవారం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగ్గయ్య చెరువు గొల్లపేటకు చెందిన గోపాలపు అనంత లక్ష్మి ఒకటో తేదీ కావడంతో 11వ సచివాలయం నుంచి పెన్షన్ తీసుకుని తన ఇంటికి వెళ్తోంది. ఇంతలో రోడ్డుపై నడిచి వెళుతున్న ఆమెను వెంబడించిన ఒక అగంతకుడు మీ ఇంటి వైపే వెళ్తున్నా దింపుతానని చెప్పి బైక్ ఎక్కించుకున్నాడు. అక్కడ నుంచి ఎంపీడీవో కార్యాలయం వెనుక వీధిలో ఎవరూలేని రోడ్డులోకి వెళ్లాకా ఒక్క సారిగా బండిపై ఉన్న వృద్ధురాలిని బైక్‌పై నుంచి కిందకు నెట్టడంతో ఆమె కిందపడిపోయింది. ఆమె వద్ద ఉన్న రూ.4 వేలు పట్టుకుని బైపాస్ రోడ్డు వైపు బైక్‌తో దుండగుడు పరారయ్యాడు. ఇది గమనించిన స్థానికుడు స్కూటీతో వెళ్లి పట్టుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వృద్ధురాలిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యసేవలందిస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ కనకారావు తన సొంత సొమ్ము రూ.4వేలు ఆమెకు అందించారు. సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఖరీఫ్ తరువాతే పంపాకు మరమ్మతులు

- బలహీనంగా నాలుగో నంబర్ గేటు
- ప్రస్తుతానికి తాత్కాలిక మరమ్మతులు
- అనంతరం పూర్తిస్థాయి నిల్వకు అవకాశం


పంపా బ్యారేజీ నాలుగో నెంబర్ గేటు నుంచి నీరు సముద్రానికి విడుదల చేస్తున్న దశ్యం


బ్యారేజీ గేట్లు ఎత్తే యంత్రాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అన్నవరం: సాధారణంగా ఒక నదిపై బ్యారేజీ లక్ష్యమేంటంటే వర్షాకాలంలో కురిసిన వర్షపునీరు ఆ బ్యారేజీలో పూర్తి స్థాయి లో నిల్వ చేసి వర్షాలు లేని సమయంలో సాగునీరు, తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతుందనే. అయితే అన్నవరంలోని పంపా రిజర్వాయర్ బ్యారేజీ గేట్లు బలహీనంగా ఉండడంతో రిజర్వాయర్‌లోకి ఎంత నీరు వచ్చినా సగం నీరు సముద్రంలోకి వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బ్యారేజీలో నాలుగో నెంబర్ గేటు బలహీనంగా ఉండడంతో ఆ గేటుకు మరమ్మత్తులు పూర్తి చేసేవరకు పూర్తి స్థాయిలో నీరు నిల్వ చేయవద్దని, 99 అడుగుల వద్ద మాత్రమే నీటి మట్టం ఉంచాలని ఉన్నతాధికారులు సూచించారు. దీంతో రెండు నెలలుగా ఆ మేరకు నీటిమట్టాన్ని ఉంచి మిగిలిన నీటిని దిగువకు వదిలేస్తున్నారు. పంపా రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులు. అయితే ఐదు అడుగులకు తక్కువగా నీటిమట్టం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పంపా ప్రాజెక్ట్‌కు 55 ఏళ్లు

పంపా రిజర్వాయర్ నిర్మించి దాదాపు 55 ఏళ్లు పూర్తయింది. అప్పుడు బ్యారేజీకి ఏర్పాటు చేసిన ఐదు గేట్లకు ఎప్పటి కప్పుడు తాత్కాలిక మరమ్మత్తులు మాత్రమే చేస్తున్నారు. గత ఆగస్టులో కర్నాటకలోని తుంగభద్ర ప్రాజెక్టు గేటు ఊడిపోవడంతో తాత్కాలికంగా మరో గేటు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణులు ప్రాజెక్టుకు గేట్లు ఏర్పాటు చేసి 40 ఏళ్లు పూర్తయితే కొత్త గేట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పంపా ప్రాజెక్టుకు కూడా గేట్లు మార్చాలని గతంలోనే నిపుణులు సూచించినా నిధుల సమస్యతో తాత్కాలిక మరమ్మత్తులు మాత్రమే చేస్తున్నారు.

గత నెలలో తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురియడంతో పెద్ద ఎత్తున వరదనీరు పంపాకు తరలివచ్చింది. అయినప్పటికీ నిల్వచేసుకునే పరిస్థితి లేక 99 అడుగులకు మించి నీరు ఉంచకుండా సముద్రంలోకి విడుదల చేస్తున్నట్టు ఈఈ శేషగిరిరావు సాక్షికి తెలిపారు.

నాలుగు సార్లు నిండితేనే ఆయకట్టుకు నీరు..

పంపా రిజర్వాయర్ కింద తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 12,500 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఒక సారి ఆయకట్టు మొత్తం సాగవ్వాలంటే 1.5 టీఎంసీల నీరు అవసరం. పంపా గర్భంలో నుంచి పుష్కర కాల్వ నిర్మాణం జరుగక ముందు పంపా రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 105 అడుగులు ఉండేది. అంటే 0.5 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. అయితే పుష్కర కాల్వ రిజర్వాయర్‌కు 103 అడుగుల ఎత్తులో నిర్మించిన తరువాత రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులకు అంటే 0.44 టిఎంసీలకు పరిమితం చేశారు. ఇప్పుడు పంపా బ్యారేజీ గేట్లు బలహీనంగా ఉండడం వలన 99 అడుగులకే పరిమితం చేయడంతో రిజర్వాయర్ నీటి నిల్వ 0.26 టిఎంసీకి పరిమితమైంది. దీంతో ఖరీఫ్ పంట కాలంలో నాలుగు సార్లు పంపా నిండితే తప్ప ఖరీఫ్ గట్టెక్కని పరిస్థితి. అయితే పుష్కర నుంచి కూడా పంపా రిజర్వాయర్‌కు నీరు విడుదల అవుతున్నందున సాగు నీటి సమస్య ఉండడం లేదు. ఒకవేళ పుష్కర నీరు రాకపోతే ఆయకట్టు సాగు ప్రశ్నార్థకమవుతుంది.

గత జూలైలో తాత్కాలిక మరమ్మతులు

గత జూలై మొదటి వారంలో గోదావరి డెల్టా ఇంజినీరింగ్ చీఫ్ సురేష్ కుమార్, ఎస్ఈ జి.శ్రీనివాసరావు పంపా బ్యారేజీ పరిశీలించి ఈఈ శేషగిరిరావుతో గేట్ల పరిస్థితిపై చర్చించారు. దీంతో అత్యవసరంగా గేట్లకు మరమ్మతులు చేయాలని సురేష్‌కుమార్ ఆదేశించడంతో సుమారు రూ.30 లక్షలతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేశారు. ఇందులో భాగంగా నాలుగు గేట్లు కు రబ్బర్ సీల్స్, బ్లాక్ గ్రీజు ఏర్పాటు, కొత్త ఐరన్ రోప్‌లు ఏర్పాటు చేసి పాడైన నాలుగో నంబర్ గేటు రేకు సగం పాడవడంతో దాని స్థానంలో కొత్త రేకు అమర్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఇంతలో జూన్ చివరి వారంలో వర్షాలు ప్రారంభమై వరదలు రావడంతో మరమ్మతులకు అవాంతరం ఏర్పడింది. ఈ మేరకు మంగళవారం ఈఈ శేషగిరిరావు మంగళవారం మాట్లాడుతూ 4వ నంబరు గేటు మినహా మిగిలిన గేట్లకు మరమ్మతులు చేశామని

పంపా బ్యారేజీ 1,2,3,5 నెంబర్ గేట్లుకు మరమ్మత్తులు చేశారని ఈఈ శేషగిరి రావు మంగళవారం సాక్షికి తెలిపారు. నాలుగో నంబరు గేటుకు మాత్రం ఖరీఫ్ అనంతరం మరమ్మత్తులు చేయిస్తామని ఆయన వివరించారు.

కాగా పంపా గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేసి 103 అడుగులకు నీటిని నిల్వ సామర్ధ్యాన్ని పెంచాలని రైతులు కోరుతున్నారు.

గేట్లు బలహీనంగా ఉండడం వల్లే తరుచూ మరమ్మతులు

పంపా బ్యారేజీ గేట్లను అప్పటి సాంకేతికత ప్రకారం అర్ధచంద్రాకారంగా (వర్టికల్) నిర్మించారు. ఆ వంపు వల్ల నిర్వహణ సమయంలో ఇబ్బంది ఎదురవుతోందని అధికారులు చెప్తున్నారు.

గత ఏడాది డిసెంబర్‌లో ఇలాగే భారీ వర్షాల సమయంలో బ్యారేజీ గేట్లు ఎత్తినపుడు నాలుగో నెంబర్ గేటు కిందకు దిగకపోవడంతో దానిని బలవంతంగా కిందకు దించాల్సి వచ్చింది. భవిష్యత్‌లో ఇటువంటి సమస్యలు రాకుండా ఉండేందుకు గేట్లు మార్చాలని అధికారులు నిర్ణయించారు. కాగా ఈ ఖరీఫ్ సీజన్ వరకు గేట్లుకు తాత్కాలిక మరమ్మత్తులు చేసి అనంతరం గేట్లు మార్చాలని నిర్ణయించారు.

99 అడుగులకు నీరు పరిమితం



పంపా రిజర్వాయర్ గరిష్ట నీటి నిల్వ 103 అడుగులు వద్ద 0.44 టీఎంసీ నిల్వ ఉంటుంది. అయితే బ్యారేజీ గేట్లలో నాలుగో నెంబర్ గేటు పరిస్థితి బలహీనంగా ఉండడంతో నీటి నిల్వను 99 అడుగుల కు పరిమితం చేస్తున్నాం. పూర్తిస్థాయి మరమ్మతులు అయ్యే వరకు రైతులు సహకరించాలని కోరుతున్నాం.

– శేషగిరిరావు, ఈఈ

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా అరెస్టు

- రూ.70 లక్షల బంగారు, వెండి వస్తువుల స్వాధీనం
- కిమ్స్ వెంకటేశ్వర ఆలయంలో చోరీ సొత్తు రికవరీ
- ఘటన జరిగి నెల తిరక్కుండానే ముఠా పట్టివేత
- నాలుగేళ్లలో మూడు రాష్ట్రాల్లో 42 చోరీలు


స్వాధీనం చేసుకున్న రూ.70 లక్షల సొత్తును ప్రదర్శించి అరెస్ట్ చేసి అంతర్రాష్ట ముఠా వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణారావు. చిత్రంలో జిల్లా పోలీసు అధికారులు, దర్యాప్తు బృందం సీఐలు, ఎస్సైలు

అమలాపురం టౌన్: అంతర్రాష్ట దోపిడీ దొంగల ముఠా అమలాపురం రూరల్ పోలీసులకు పట్టుబడింది. నాలుగేళ్ల నుంచి మన రాష్ట్రంతో పాటు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో 42 చోరీలు చేసిన ఈ ముఠాను అమలాపురం రూరల్ పోలీసులు అరెస్టు చేసి భారీ ఎత్తున బంగారు, వెండి వస్తువులను రికవరీ చేశారు.

తీగ లాగితే డొంక కదిలినట్టు అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలోని వేంకటేశ్వర ఆలయంలో గత నెల 4వ తేదీన ఈ ముఠా చోరీకి పాల్పడి రూ.70 లక్షల విలువైన 868 గ్రాముల బంగారు, 8.56 కిలోల వెండి వస్తువులను దోచుకుంది. ఆ సొత్తు మొత్తాన్ని రికవరీ చేసినట్టు పోలీసు అధికారులు వెల్లడించారు. చోరీ జరిగి నెల రోజుల తిరక్కుండానే ముఠాను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు, ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ముఠా చోరీల చిట్టాను వివరించి రికవరీ చేసిన సొత్తును ప్రదర్శించారు.

నలుగురి సభ్యుల ముఠా అరెస్టు

ఈ చోరీకి పాల్పడిన శ్రీకాకుళం జిల్లా గుర్రాల మెట్ల శివారు గార్లపాడు గ్రామానికి చెందిన సవర సూర్యం, సవర చిన్నారావు, శ్రీకాకుళం జిల్లా జోగివలస గ్రామానికి చెందిన సవర రజని, తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాకు చెందిన ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా కారిగూడ గ్రామ నివాసి బత్తిని శ్రీకాంత్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా శ్రీకాకుళం జిల్లాలో 37, విశాఖ నగరంలో ఒకటి, ప్రకాశం జిల్లాలో ఒకటి, గుంటూరు జిల్లాలో ఒకటి, తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాలో ఒకటి, ఒడిశా రాష్ట్రంలో ఒక చోరీకి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

ఈ ముఠాలో మొత్తం 19 మంది సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ ముఠా చేసిన చోరీలో రూ.50 లక్షలు సొత్తు కాజేసినట్లు దర్యాప్తులో గమనించారు. దర్యాప్తులో భాగంగా ముఠాలో మిగిలిన సభ్యుల వివరాలు సేకరించి శ్రీకాకుళం జిల్లా పోలీసులకు సమాచారం అందించారు.

దర్యాప్తు బృందానికి రివార్డులు

ఈ చోరీ కేసును దర్యాప్తు చేసి నెల రోజుల్లోపే నిందితులను పట్టుకుని, నూరు శాతం సొత్తును రికవరీ చేసిన పోలీసు బృందాన్ని ఎస్పీ కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించి వారికి రివార్డులను ప్రదానం చేశారు. చోరీ కేసు దర్యాప్తు, సొత్తు రికవరీలో పోలీసు అధికారులతోపాటు జిల్లా పోలీస్ ఐటీ కోర్ ప్రతినిధి జాఫర్, జిల్లా క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్లు అరిగెల శుభాకర్, లంకాడి శ్రీనివాస్, బొక్కా దుర్గా ప్రసాద్, కేతా రమణ, అర్జునరావు, హరిబాబు, చిన్న ప్రసాద్‌లు కూడా కీలకంగా వ్యహరించారు. వీరికి కూడా జిల్లా ఎస్పీ కృష్ణారావు రివార్డులు అందించారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, రూరల్ ఎస్సై వై.శేఖర్‌బాబు, సీఐ డి.ప్రశాంత్‌కుమార్, క్రైమ్ ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, క్రైమ్ పార్టీ హెచ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

జల్సాలకు అలవాటు పడి.. ముఠాకట్టి..

ముఠాలోని సభ్యులంతా జల్సాలకు అలవాటు పడి చెడు వ్యసనాల బాట పట్టి ముఠా కట్టినవారే. 2012 సంవత్సరం నుంచి ఈ ముఠా మూడు రాష్ట్రాల్లో చోరీలు చేస్తున్నా ఎప్పుడూ పోలీసులకు పట్టుబడలేదు. తాజాగా వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీకి పాల్పడ్డ ఈ ముఠాను ఆధునిక సాంకేతికతతో స్థానిక పోలీసులు పట్టుకున్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

ఎస్పీ కృష్ణారావుకు బాధితుల ఫిర్యాదు


ఫిర్యాదు చేసేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులు

అమలాపురం టౌన్: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని తమ వద్ద రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేసి రెండేళ్ల నుంచి తిప్పించుకుంటున్నారని బాధితులు ఎస్పీ కృష్ణారావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అల్లవరం మండలానికి చెందిన సబ్బతి సుజన్ మరో వ్యక్తితో కలిసి తమను మోసం చేశాడని దాదాపు 10 మంది బాధితులు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయనకు వివరించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలు, రావుల పాలెం, అంబాజీపేట, అప్పనపల్లి గ్రామాలకు చెందిన బాధితులు తమకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని తమ వద్ద నుంచి రూ.20 లక్షల వరకూ తీసుకున్నారని వారు తెలిపారు. సబ్బతి సుజన్‌కు శ్రీధర్ అనే వ్యక్తి కూడా తోడై తమను మోసం చేశాడని బాధితులు ఆరోపించారు. నిందితుడు సుజయ్‌ది అల్లవరం మండలం కావడంతో ఆ మండల పోలీస్ స్టేషన్‌లో ఈ కేసును దర్యాప్తు చేయాల్సిందిగా ఎస్పీ కృష్ణారావు డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు, ఎస్సై హరీష్‌కుమార్‌ను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కృష్ణ


భువన సాత్వికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు మెల్లం భువన సాత్విక, బొంతు అస్మిని (స్టాండ్ బై) ఎంపికయ్యారని హెచ్‌ఎం గుంట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ జిల్లాస్థాయి పోటీలో భువన సాత్విక ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైందని తెలిపారు. విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆమె పాల్గొంటుందని తెలిపారు.

కిర్లంపూడి నుంచి ఇద్దరు..

కిర్లంపూడి: తామరాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం కాకినాడలో నిర్వహించిన క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అండర్-17 విభాగంలో కె.అజయ్, అండర్-14 విభాగంలో కె.జయరాజు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎల్.కృష్ణ తెలిపారు.

కబడ్డీ పోటీలకు

జగ్గంపేట: రాష్ట్రస్థాయి క్రీడలకు జగ్గంపేట హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు స్కూల్ హెచ్‌ఎం టీవీఎస్ రంగారావు తెలిపారు. అండర్ 14 కబడ్డీ విభాగంలో సీహెచ్ పుష్ప, బి.రత్నకుమారి, సీహెచ్ రితిక జ్యోతి, జి శశాంక్, డి.దుర్గాప్రసాద్ ఎంపిక కాగా, అండర్ 17 కబడ్డీ విభాగంలో ఎం.శ్యామ్, ఎ.గంగాభవాని, పవర్ లిఫ్టింగ్ విభాగంలో పి.రాణి, కె.ప్రసన్న కుమార్ ఎంపికైనట్టు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను పీడీ బి.మురళీకుమార్, బి.నీలకంఠేశ్వరరావు, ఉపాధ్యాయులు కృష్ణ మోహన్, మూర్తి, హుస్నారా బేగం తదితరులు అభినందనలు తెలిపారు.



క్రీడలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రౌతులపూడి: ఈ నెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు రౌతులపూడి విద్యార్థులు ఎంపికయ్యారని రౌతులపూడి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కోళ్ల రాంబాబు మంగళవారం తెలిపారు. ఇటీవల అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో ట్రయథ్లన్, కిడ్స్ జావలిన్ లలో తొమ్మిదో తరగతికి చెందిన శ్రీరంరెడ్డి కుశరాజు జిల్లాస్థాయి పోటీలలో ప్రథమ స్థానం కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి ఎంపికయ్యాడు. అండర్-16 విభాగంలో పదో తరగతికి చెందిన బల్లాడి రోహిత్ రోషన్ లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. వీరు ఈ నెల 4 నుంచి 6 వరకు రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. అలాగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 విభాగంలో వాలీబాల్ పోటీలో రౌతులపూడి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన గౌరికపూడి అభినయ్ ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని ఆయన తెలిపారు.

5న నన్నయలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు కౌన్సెలింగ్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల ఐదో తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే ఈ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు ఏపీ ఐసెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

పాముకాటుకు వ్యక్తి మృతి


మృతుడు లోవరాజు

కోటనందూరు: గ్రామంలో పశువుల పాక వద్ద మూగజీవాలకు గడ్డి వేసేందుకు వెళ్లిన జాగారపు లోవరాజు (35) సోమవారం రాత్రి పాము కాటుకు గురయ్యాడు. ఆ విషయం గమనించని లోవరాజు గంట తరవాత తల తిరుగుతున్నట్టు అనిపించి స్థానిక ఆర్ఎంపీ వద్దకు వెళ్లి వైద్యం చేయించుకున్నాడు. పరిస్థితి విషమిస్తుండడంతో బంధువులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ వైద్య సిబ్బంది తుని ఏరియా ఆసుపత్రికి సూచించారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. లోవరాజు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.